క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండదు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 11న గ్రేటర్ వరంగల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్‌తో పాటు శివారు ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్లలో దశల వారీగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో వివరించారు.

నేడు స్మృతి - శ్రుతి సంస్మరణ సభ

హన్మకొండ కల్చరల్: అన్నమయ్య సాహితీ కళావికాస పరిషత్ ఆధ్వర్యంలో కళాతపస్వీ పద్మశ్రీ కె.విశ్వనాథ్, ప్రముఖ గాయని పద్మభూషణ్ వాణీజయరాం స్మృతి - శ్రుతి సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూత్రపు అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చలన చిత్రాలలో, వాణీజయరాం పాడిన పాటల సినీ సంగీత విభావరిని హంటర్‌రోడ్డులోని మాస్టర్‌జీ కళాశాలలో బయోఫార్మా అండ్ మాగ్నసెల్స్ కార్పొరేషన్ అధినేత ఉపేందర్ మహేశ్వరం సౌజన్యంతో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఏసీపీగా బాధ్యతల స్వీకరణ



రామన్నపేట: వరంగల్ ఏసీపీగా బోనాల కిషన్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్‌ను ఏసీపీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ కిషన్‌కు పలువురు ఇన్‌స్పెక్టర్లు అభినందనలు తెలిపారు.

ఏసీపీకి అభినందనలు

వరంగల్: వరంగల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్‌ను మట్టెవాడలోని కార్యాలయంలో వరంగల్ మార్కెట్ ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వరంగల్ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి బీవీ.రాహుల్, గ్రేడ్-2 కార్యదర్శి అశోక్, అసిస్టెంట్ సెక్రటరీలు జన్ను భాస్కర్, లాషరిఫ్ పాల్గొన్నారు.

'భట్టి' మాటలు సరికాదు

హన్మకొండ: చేపలు పట్టడం ముదిరాజ్ కులస్తులు జీవనాధారం అని, అలాంటి వృత్తిలోకి ఇతర కులాలను చేర్చాలని శాసనసభలో కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత భట్టి విక్రమార్క అనడం సబబు కాదని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని కేంద్ర కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గాల్లో మెజారిటీ ప్రజలు చేపలు పట్టుకొని కుటుంబాలను పోషిస్తున్నారని గుర్తుచేశారు. ఇతర కులాలను చేపల వృత్తిలోకి చేరిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటు హర్షణీయం

హన్మకొండ: కాజీపేటలో నెలకొల్పుతున్న పీరియాడికల్ ఓవర్ హాలింగ్ యూనిట్ స్థానంలో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు హర్షణీయమని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు పేర్కొన్నారు. ఈమేరకు రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఓహెచ్‌ని రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాజెక్టుగా అప్‌గ్రేడ్ చేసి రూ.521 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు, ప్రాజెక్టు కోసం 150 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వానికి వరంగల్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

కృత్రిమ అవయవాల పరికరాల కేంద్రం ప్రారంభం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవ పరికరాల కేంద్రాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కృత్రిమ అవయవ పరికరాల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేందని అన్నారు. ఇకనుంచి స్థానికంగానే అధునాతన, నాణ్యమైన పరికరాలను దివ్యాంగులు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. వెంకటేశ్వర ఆర్థో కేర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్లు రంజిత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి తమ కేంద్రంలో జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన కృత్రిమ అవయవాలను అమర్చనున్నట్లు వారు చెప్పారు.

కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ రూరల్: గ్రూప్-2, 3, 4 పోటీ పరీక్షల ఉచిత కోచింగ్‌కు వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) షేక్ జహీరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93463 74583 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సభలో మాట్లాడుతున్న మురళీధర్‌గౌడ్



హనుమకొండ చౌరస్తా: మాట్లాడుతున్న పద్మ



హసన్‌పర్తి: మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

వరంగల్: భారతీయ జనతా పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రజల కోసం కేంద్రం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను నాయకులు, కార్యకర్తలు.. ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శి డాక్టర్ మురళీధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శక్తి కేంద్రాల ప్రారంభోత్సవాల సందర్భంగా పోచమ్మమైదాన్‌లో ఏర్పాటు చేసిన 'పేదల గోస - బీజేపీ భరోసా' పేరుతో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 10నుంచి 25వ తేదీ వరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని శక్తి కేంద్రాల పరిధిలో ఈ సభలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వన్నాల శ్రీరాములు, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్‌షా, కుసుమ సతీష్‌బాబు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, అచ్చ విద్యాసాగర్, వన్నాల వెంకటరమణ, అల్లం నాగరాజు, ఎరుకల రఘునారెడ్డి, బాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస్, ఆకుల మహేష్, తాబేటి వెంకట్, మోహన్ పాల్గొన్నారు.

'కబ్జాలకు కేరాఫ్ పశ్చిమ ఎమ్మెల్యే'

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో భూ మాఫియా, కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మారారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాగోస - బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా హనుమకొండ చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో భూకబ్జాలతో పేద, మధ్య తరగతి ప్రజలను ఎమ్మెల్యే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కనుమరుగవతోందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాల ద్వారా విడుదల చేసిన రూ.వందల కోట్ల వ్యయంతోనే వరంగల్ మహానగరం అభివృద్ధి చెందుతోందని వివరించారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సాయిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాయకులు కల్యాన్, డాక్టర్ మురళీధర్‌గౌడ్, జయంత్ లాల్, గంద్రతి శ్రీనివాస్, రావుల కిషన్, బైరి శ్రావణ్, కందగట్ల సత్యనారాయణ, మధుసూదన్, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, దేవేందర్‌రెడ్డి, రావుల సుదర్శన్, కృష్ణమాచారి, హరీశ్, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే కేసీఆర్ పతనం ఖాయం

హసన్‌పర్తి: ఎప్పుడైతే టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారిందో.. అప్పటి నుంచే సీఎం కేసీఆర్ పతనం ప్రారంభమైందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆరోపించారు. శుక్రవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందించనున్నట్లు చెప్పారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ అనిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, కార్పొరేటర్ అరుణకుమారి, రవినాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్లపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు



నాయినికి స్వాగతం పలుకుతున్న మహిళలు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ వేధింపులకు గురిచేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. హనుమకొండలోని 5వ డివిజన్‌లో కొత్తూరు పోచమ్మగుడి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన పలుకాలనీల్లో పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ ఆధీనంలో ఉండాల్సిన డివిజన్ కమ్యూనిటీ హాల్‌ను బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ విద్యాసాగర్ ఆధీనంలో ఎందుకు ఉందని ప్రశ్నించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వినయ్‌భాస్కర్‌కు డివిజన్లలో ప్రొటోకాల్ పాటించాలనే సోయి లేకుండా పోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, నాయకులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని మాజీ ఎమెల్యే కొండా సురేఖ పిలుపునిచ్చారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 22వ డివిజన్‌లోని 80ఫీట్ల రోడ్డు, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో సురేఖ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోందని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గంలోని 22వ డివిజన్‌లో గతంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఇప్పటి స్థానిక ఎమ్మెల్యే నరేందర్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాచరిక తరహా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ వసీం, మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, మడిపల్లి కృష్ణ, కూరతోట సదానందం, చిప్ప వెంకటేశ్వర్లు, దాసరి రాజేష్, కూచన రవీందర్, కర్ణాకర్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: తెలంగాణ ఏర్పాటు సమయంలో కేంద్రం ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ తహసీల్‌లో తహసీల్దార్ ఫణికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్.. జనాభా దామాషాను విస్మరించి, కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారీ వర్గాలకు ప్రయోజనాలు కలిగించే విధంగా ఉందని ఎద్దేవా చేశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నగర కమిటీ సభ్యులు మాలి ప్రభాకర్, గోరంటల శరత్‌బాబు, నలువేల రవి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం లొల్లి



రేషన్‌షాపు వద్ద బారులు తీరిన జనం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 5వ డివిజన్ కొత్తూరు జెండా ప్రాంతంలోని 37వ రేషన్ దుకాణం ఎదుట లబ్ధిదారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సన్నబియ్యం ఇస్తున్నారనే సమాచారంతో ఉదయం 8గంటలకే రేషన్ దుకాణం వద్దకు ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అయితే ఒకటి, రెండు బస్తాల్లో మాత్రమే సన్న బియ్యం రాగా మిగిలిన వాటిలో దొడ్డు బియ్యం ఉండడంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఒక దశలో రేషన్‌షాపు నిర్వాహకుడు లక్ష్మణ్‌తో వాగ్వాదానికి దిగారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరకుని గొడవ సద్దుమణిగేలా చేశారు.

విద్యారంగానికి అరకొర నిధులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించిందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు విమర్శించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తక్కువ నిధులను ప్రభుత్వం కేటాయించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, రాష్ట్ర బాధ్యులు అంబాల కిరణ్, బాధ్యులు గట్టు ప్రశాంత్, కొలిపాక వంశీ, గోపాలకృష్ణ, క్రాంతి, మల్లేష్, సాయి, వరప్రసాద్, కిషోర్, అశోక్, మహేష్, విజయ్, ఆజాం పాల్గొన్నారు.

18న శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాకేష్‌రెడ్డి, తదితరులు

నయీంనగర్: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18న సాయంత్రం 5గంటల నుంచి ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రం కుడా మైదానంలో నిర్వహించనున్న శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని భద్రకాళి ఆలయ ప్రధానార్చకుడు శేషయ్య కోరారు. ఈమేరకు సమ్మేళనం కరపత్రాలను శేషయ్యతో కలిసి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి, సభ్యులు హనుమకొండలోని హరితహోటల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లావుడ్య రవి, హిందువాహిని మహానగర అధ్యక్షుడు శ్రీరామ్ ఉదయ్, ప్రభుజీ, సూర్యప్రతాప్ రెడ్డి, నిరంజన్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ రాజు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని లక్ష్య సాధనకు ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యతోపాటు అన్ని రాణించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు రవీందర్‌రాజు, కిరణ్‌కుమార్, పుష్పలత, సుమలత, నాయకులు పెరుగు సురేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్సై విద్యాసాగర్ సూచించారు. రంగశాయిపేట లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సైబర్ నేరాలు, షీటీం సేవలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అదుపు చేయడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థులు ఎవరితోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శేర్ల రజని, ఉపాధ్యాయులు సాయికృష్ణ, సాలెహా, యాకుబ్‌పాషా, శ్రీధర్, షీ టీం కానిస్టేబుళ్లు వంశీ, పూర్ణ పాల్గొన్నారు.

రేపు 3కే లవ్ ఫిట్ రన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నయీంనగర్ /కేయూ క్యాంపస్: ఈనెల 12న ఉదయం 6గంటలకు కాజీపేట నిట్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు 3కే లవ్ ఫిట్ రన్ నిర్వహించనున్నట్లు రాజ్ ఎరోబిక్స్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ప్రెస్ క్లబ్‌లో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 3కే రన్‌తో యువతకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి చక్రవర్తి ఆస్పత్రిలో ఉచితంగా ఓపీ, రక్త పరీక్షలు, రేడియాలజీ పరీక్షలపై 50శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు డాక్టర్ తరుణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్తీక్, శ్రీను, అంజనీదేవి, సునీత పాల్గొన్నారు. అలాగే, ఫిట్‌రన్ వాల్‌పోస్టర్లను కేయూ ఫార్మసీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సమ్మయ్య, తదితరులు తెలిపారు.

15న ఆరెకుల 'చలో హైదరాబాద్'



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రావు

నయీంనగర్: ఈనెల 15న హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న ఆరెకుల భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆరె కులస్తులు పాల్గొనాలని ఆరెకుల స్టీరింగ్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి కిషన్‌రావు పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరెకుల భవన నిర్మాణానికి రూ.కోటి కేటాయించడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భూమి పూజ అనంతరం అక్కడే ఆరెకుల రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ అధ్యక్షతన సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు గైక్వాడి మోహన్‌రావు, జెండా అంజయ్య, సోమిడి శ్రీనివాస్, శిర్ల రవీందర్, మోర్తాల రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ వాణికి నగదు పురస్కారం



వాణికి పురస్కారం అందజేస్తున్న కేంద్ర మంత్రి

ఖిలా వరంగల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ మూడు రకాల పోటీలను వర్చువల్ పద్ధతిలో ఇటీవల నిర్వహించింది. లోరీ (లాలిపాట), దేశభక్తి పాటలు, రంగోళి పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 5లక్షల మంది పాల్గొన్నారు. ఇటీవల 272 మంది విజేతలను కేంద్ర సాంస్కృతిక శాఖ ప్రకటించింది. శివనగర్ ప్రాంతానికి చెందిన ములుగు జిల్లా జవహర్‌నగర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు ధర్మపురి వాణి ప్రతిభ కనబరిచి నగదు పురస్కారం అందుకున్నారు. ఈనెల 5న న్యూఢిల్లీలో జరిగిన విజేతల బహుమతుల ప్రదానంలో సాంస్కృతిక శాఖ మంత్రి మీనాక్షి లేకి చేతుల మీదుగా వాణి రూ.50వేల నగదు పురస్కారం, మెమెంటో అందుకున్నారు. ఈ సందర్భంగా శివనగర్‌లోని పద్మశాలి భవనంలో ఆమెను పలువురు శుక్రవారం సన్మానించారు.

సంక్షిప్తంగా

క్రీడల ప్రాక్టీస్‌కు స్టేడియానికి రండి

కాశిబుగ్గ: ఓ సిటీ స్టేడియంలో రోజూ జరిగే క్రీడల ప్రాక్టీస్‌కు ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు రావాలని వరంగల్ జిల్లా యువజన క్రీడల ఆధికారి ఎస్.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రోజూ ఉదయం 6నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 8 గంటల వరకు ఓ సిటీ స్టేడియంలో కోచ్‌ల ఆధ్వర్యంలో క్రికెట్, హ్యాండ్‌బాల్,జూడో, వాలీబాల్, ష టిల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పేస్కేల్ ప్రకటనపై మెప్మా హర్షం

వరంగల్ అర్బన్: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మెప్మా సిబ్బందికి పేస్కేల్ అమలుపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటనపై ఉద్యోగుల సంఘం శుక్రవారం హర్షం వ్యక్తం చేసింది.

13న కలెక్టరేట్ల ముట్టడి

హన్మకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో బీసీలపై వివక్ష చూపడాన్ని నిరసిస్తూ ఈనెల 13న కలెక్టరేర్లు ముట్టడించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 2శాతం నిధులు మాత్రమే బీసీలకు కేటాయించి ప్రభుత్వం వివక్ష చూపిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో 13న కలెకరేట్ల ముట్టడితో పాటు మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాల ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేయనున్నట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేయాలి

కాజీపేట అర్బన్: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి అందజేయాలని కాజీపేట మండల సీపీఐ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా కోరారు. ఈమేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గోల్కొండ కుమార్, మాతంగి పోలు, అమూల్య, నిరంజన, స్వరూప, సమ్మయ్య పాల్గొన్నారు.

జాతీయ యోగా నిపుణుడికి సన్మానం

హన్మకొండ: పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన జాతీయ యోగా నిపుణుడు కృష్ణానాయక్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా కృష్ణానాయక్‌కు హరిత కాకతీయ హోటల్ యోగా శిబిరం యోగా గురువు పోశాల శ్రీనివాస్, యోగా సాధకులు స్వాగతం పలికి నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు.

ఐసీఏఐ నూతన కార్యాలయం ప్రారంభం

రామన్నపేట: వరంగల్ వేణురావు కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కార్యాలయాన్ని హంటర్‌రోడ్డులోని సాయినగర్ కాలనీకి మార్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన భవనాన్ని సంస్థ జిల్లా చైర్మన్ సీఏ ప్రదీప్‌చందర్, సతీమణి బిందు ప్రారంభించారు. కార్యక్రమంలో హరికృష్ణ, సత్యనారాయణ, గోపిచంద్, రాజేంద్రకుమార్, శ్రవణ్‌కుమార్, ఓంప్రకాశ్‌లోయ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన మోతీలాల్ నాయక్

కాశిబుగ్గ: సీఎం కేసీఆర్‌ను కాశిబుగ్గకు చెందిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు భూక్య మోతీలాల్ నాయక్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పోస్టులలో తనకు అవకాశం కల్పించాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.

ఓరుగల్లు.. కళలకు నిలయం

హన్మకొండ అర్బన్: ఓరుగల్లు నగరం.. కళలకు నిలయం అని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ అన్నారు. లూట్ ఓటీటీ ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి నిర్వహించనున్న జానపద కళల పోటీలకు సంబంధించి ప్రచార వాల్‌పోస్టర్‌ను హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించారు.

పెట్టుబడివర్గాలకు కొమ్ముకాసే బడ్జెట్

హన్మకొండ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్.. అంకెల గారడీగా, సంపన్న వర్గాలు, పెట్టుబడిదారులను సంతృప్తి పరిచేవిధంగా ఉందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి విమర్శించారు. ప్రభుత్వాల తీరును నిరసిస్తూ హనుమకొండ తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాస్ సావిత్రి, గడ్డం నాగార్జున, శ్రీనివాస్, ఓదెల జయ, సరిత, నరసమ్మ తదితరులు ఉన్నారు.

జూడో పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

కాజీపేట రూరల్: 7వ తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లా జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో కరీంనగర్ మంకమ్మతోటలో జరిగిన పోటీల్లో గురుకుల బాలికలు పాల్గొని వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈమేరకు క్రీడాకారులతో పాటు కోచ్ నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరితను వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి, హనుమకొండ జిల్లా సమన్వయ అధికారి డి.ఉమామహేశ్వరి అభినందించారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై బీజేపీ అనుబంధ సంస్థ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు హమారప్రసాద్ అనుచితంగా మాట్లాడారని, ఈక్రమంలో అతనిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కళ్యాణ్, ఎస్ఎస్‌యూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మనోజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి రాకేష్, బీసీ సంఘం జిల్లా నాయకులు ప్రశాంత్, భగత్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా



కాశిబుగ్గ: మిషన్ భగీరథ పనులతో పైపులైన్లు ధ్వంసమై తాగునీరు వృథా అవుతోంది. వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం కోసం జేసీబీతో శుక్రవారం తవ్వారు. దాంతో పైపులైన్ పగిలిపోయి తాగునీరు లీకేజీ అయింది. ఈక్రమంలో ఆ మార్గంలో రాకపోకలు సాగించిన వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, రెండు రోజుల నుంచి నీరు రావడం లేదని, ఈక్రమంలో వచ్చిన నీటిని కూడా రోడ్డు పాలు చేశారని స్థానికులు వాపోయారు.

అనాథ పిల్లల నమోదు షురూ..

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో అనాథ పిల్లల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. వరంగల్, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన అనాథ పిల్లల నమోదు ప్రక్రియ కలెక్టరేట్‌లోని ధరణి సమాచార కేంద్రం పక్కన జిల్లా బాలల రక్షణాధికారి(ఇన్‌చార్జ్) దొమ్మటి రాజు పర్యవేక్షణలో శుక్రవారం కొనసాగింది. మండలాలవారీగా మీసేవ కేంద్రాల్లో నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్య, ఉద్యోగావకాశాల్లో అనాథ పిల్లలకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నమోదు ప్రక్రియ ముగిసిన నెల రోజుల్లో తహసీల్దార్లు అనాథ పిల్లలకు గుర్తింపు కార్డులు జారీ చేస్తారని చెప్పారు. నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, 156 దరఖాస్తులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు.